# <u>ఐదో అధ్యాయం</u>

# గోగినేని మణి రచనా విశేషాంశాలు

# 5. గోగినేని మణి రచనా విశేషాంశాలు

## ఉపోద్ఘాతం :

తెలుగు కథలలో భాష అత్యంత ప్రధానమైంది. ఏ రచయితయినా పాఠకులను దృష్టిలో పెట్టుకుని భాషాశైలిని ఏర్పరచుకుంటాడు. కథకు తగ్గట్టుగా దానిలోఉన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సన్నివేశాలకు, పాత్రలకు తగ్గట్టుగా పాత్రోచితమైన భాషను ఎన్నుకుని కథారచనకు శ్రీకారం చుడతాడు. భాష రచయిత భావాలకు ఒక విధమైన రూపాన్నిస్తుంది. రచయిత యొక్క శిల్ప ప్రావీణ్యత అతడు ఉపయోగించేభాష మీద ఆధారపడి ఉంటుంది. భావ వ్యక్తీకరణలో పటిష్టమైనభాషను ప్రయోగించకపోతే ఆ భావం అగమ్యగోచరంగా, అర్థరహితంగా, పేలవంగా మారే అవకాశం ఏర్పడుతుంది. భాష "జన వ్యవహారానికి దగ్గరగా ప్రచార సాధనాల వల్ల చదువు నేర్చిన వారందరికి అలవాటైన పద్ధతిలో సరళంగా, సులభగ్రాహ్యంగా పువ్వులలో కలిసిమెలిసి ఉండే తావిలాగ వేరే చేయడానికి వీలులేని విధంగా తీర్చిదిద్దబడాలి"[1]

## 5.1 భాష :

గోగినేని మణి కథలలో చాలా వరకు శిష్ట వ్యవహారిక భాషనే ప్రయోగించారు. రచయిత్రిది ఉత్తరాంధ్ర ప్రాంతం కావున కొన్ని కథలలో పాత్రలకు ఉత్తరాంధ్ర గ్రామీణ యాసను ప్రయోగించారు. రచయిత్రి తన పరిసర ప్రాంత సంఘటనలు కథలకు ఇతివృత్తంగా తీసుకుని రచించారు కావున ఆ సన్నివేశాలకు, పాత్రలకు తగినట్లు భాషను ఎంచుకున్నారు. పాఠకుడు రచయిత భావాన్ని, అతడు చెప్పిన సందేశాన్ని స్పష్టమైన భాష ద్వారానే గుర్తించగలుగుతాడు. అటువంటి భాషను ప్రయోగించినప్పుడే పాఠకుడు ఆకర్షితుడవుతాడు. రచయిత్రి తన కథలలో స్పష్టమైన భాషను ప్రయోగించి సరళమైన వాక్యాలలో, సులభ గ్రాహ్యంగా రచన చేసారు.

## 5.2 శైలి :

భాష తరువాత శైలి అత్యంత ప్రధానమైనది. శైలి అనే పదాన్ని ఆంగ్ల భాషలో "Style" అంటున్నాం. రచయిత వ్యక్తిత్వానికి శైలి అద్దం పడుతుంది. రచయితల వ్యక్తిత్వం

1. డా॥ కొడవటిగంటి కుటుంబరావు, సాహిత్య ప్రయోజనం వ్యాసావళి, పుట 106

ఆయా రచనలలో మనకు స్పష్టంగా కనిపిస్తుంది. రచయిత శైలిలో ప్రాంతీయ, కుటుంబ, సమాజ ప్రభావాలు తప్పకుండా ఉంటాయి. శైలిని గూర్చి James Weber, Wall Taylor ఇలా నిర్వచించారు.

"What all this means is that a novilist must have over and above all the specific narrative devicestie has a manner the must have away of doing things not necessary away that can be promply cobled but a way that can be felt by the reader".[2]

రచయిత యొక్క జీవ లక్షణంగా, జీవిత విధానంగా పేర్కోనడమే కాకుండా పాఠకుడే రచయిత యొక్క శైలిని నిర్ణయిస్తాడని వివరించాడు. ప్రతి కథా రచయిత ఒక ప్రత్యేకతను కలిగి ఉంటారు. కొందరు అలంకారిక శైలిని, మరికొందరు వర్ణనాత్మక శైలిని, మరికొందరు కథాకథన శైలిని, ఇంకొందరు సంభాషణాత్మక శైలిని, మరికొందరు మాండలిక శైలిని అవలంభించి వారి రచనలలో అదే ప్రత్యేక శైలిగా స్థిరపరచుకొని కథలు రాసి రచయితలలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకునే ప్రయత్నం చేస్తారు. ఆ ప్రయత్నంలో కొంత మేర సఫలీకృతులౌతారు. అటువంటి కథా రచయిత్రులలో గోగినేని మణి ఒకరు. వీరి కథలలో కొన్ని ప్రత్యేక శైలులను కనబరిచారు. ఆ విశేషాలను గమనిస్తే ప్రధానంగా సంభాషణలు, సన్నివేశ కల్పనలు, వర్ణనలు, నూతన పదబంధాలు, సామెతలు, కవితాత్మక వ్యక్తీకరణ, ఇతివృత్త స్వీకారం సందర్భానుసారంగా, పాత్రోచితంగా రాసి తన ప్రతిభను చాటుకున్నారు.

### 5.3 సంభాషణలు :

గోగినేని మణి తన కథలలో చక్కటి సంభాషణల ద్వారా నాటకీయతను కలిగించారు. కథలలో ఉన్న పాత్రల ద్వారా సంభాషణశైలిని పాటించారు. కథ ప్రథమ పురుషలో నడిచినా, ఉత్తమపురుషలో నడిచినా సంభాషణలు మాత్రం ఏదో ఒక పాత్రలో అనుసంధానం కలిగిస్తూ కథాగమనానికి, కథాకథనానికి ఒక వైవిధ్యభరితమై భాషాపటిమను, సంభాషణ శోభను తీసుకొచ్చి కథలకు కొత్తదనాన్ని కలిగించారు. వాటిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గవి.

### 5.3.1 తొలిచూపు కథలో సంభాషణ శైలి :

తొలిచూపు కథలో తల్లి కూతుళ్ళ మధ్య సంభాషణ ఇలా సాగింది.

2. The Novel and the people - Ralph Fox - page 115

శాంత : "ఏమిటమ్మా... అలా కూర్చున్నావు"

సుభద్రమ్మ : "ఏం చేయమంటావు నీతమ్ముడు చేసుకొచ్చిన నిర్వాకానికి మతిపోతోంది!"

శాంత : "ఏమిటీ... రఘు వూరి నుండి వచ్చేశాడా! కొంపదీసి ఎవర్నైనా తీసుకొచ్చి వీళ్ళే నాభార్యాపిల్లలు. నేనెప్పుడో పెళ్లి చేసుకున్నాను అన్నాడా... ఏమిటి?"

సుభద్రమ్మ : "ఆఁ అంత కాకపోయినా యించుమించు అలాగే చేసుకొచ్చాడులే!"

శాంత : "ఏమిటమ్మా... ఏం జరిగిందసలు?"

సుభద్రమ్మ : ఏముందే... నారాయణరావు గారి అమ్మాయి నీరజను చూసి వస్తానని వెళ్ళాడు కదా! సాయంకాలం వరకూ వాళ్ళతోనే గడిపాడట. సాయంకాలం వీళ్ళిద్దరూ ఆ అమ్మాయి అన్న, తమ్ముడు కలిసి సినిమాకు వెళ్ళారట. అదే తెచ్చింది ముప్పు! అక్కడ హాల్లో వేడితో పాటు ఎప్పుడో కాలేజిలో చదువుకున్న ఫ్రెండొకడు తటస్థ పడ్డాడట. చెల్లెలుతో వచ్చాడట. ఆ పిల్లని చూడగానే మన వాడికి మతిపోయింది కాబోలు.[3]

## 5.3.2 ప్రేమ లేఖ కథలో సంభాషణా శైలి :

ప్రేమ లేఖ కథలో భార్యాభర్తల మధ్య జరిగిన సంభాషణను నాటకీయంగా మలిచారు రచయిత్రి.

భాస్కర్ : "ఏమిటీ సినిమాకి టిక్కెట్లు దొరకలేదా, అలా పెను చీకటాయె లోకం" అన్నట్లుగా కూర్చున్నావ్?"

అరవింద : "పక్కింటి వాళ్ళకి చుట్టాలొచ్చిపడ్డారు. సినిమా ప్రోగ్రాం మానుకున్నాం.

భాస్కర్ : "ఏమిటీ, పాపం తనకేమైనా..."

---

3. తొలిచూపు కథాసంపుటి – గోగినేని మణి – పుట 9

అరవింద : ఏం కాలేదు. నిక్షేపంలా ఉంది. పెళ్ళి నిశ్చయమైంది మంచి సంబంధం. అదృష్టవంతురాలు."

భాస్కర్ : "అయితే నీకు విచారం దేనికోయ్? నువ్వేం వెనుకబడి పోలేదుగా, నీకు ఆర్నెల్లు ముందే అయిందిగా!"

అరవింద : "నాకు తక్కువైనదేమిటో ఈ రోజే అర్థమైంది. నేను వెళ్ళే సరికి రమ్య మంచం మీద బోర్లా పడుకుని... చెంపకి చేయి ఆనించి, ఉత్తరం చదవుకుంటోంది".

భాస్కర్ : "కాళ్ళు రెండూ కొంచెం పైకెత్తి మెల్లగా కదిలిస్తుంటే... పచ్చని పాదాలపై వెండి మువ్వల పట్టీలు తెల్లగా మెరిసిపోతున్నాయ్! అవునా?"

అరవింద : "మీరెపుడు చూశారూ..."

భాస్కర్ : ఈ మాత్రం దానికి చూడాలా! నీ వర్ణన వరస క్రమాన్ని బట్టి చెప్పానంతే. అవును, నవలలుగానే రాయటం మొదలుపెట్టావా, 'ఉత్తరం చదువుకుంటోంది' అని చెప్పడానికి అంతలా సాగదీసి చెబుతున్నావే.

అరవింద : "సాగదీయటం అనరు, కళ్ళకు కట్టినట్లుగా వర్ణించడం అంటారు. మీకసలు రస హృదయం లేదు."

భాస్కర్ : "ఎవరి హృదయంలోనైనా రక్తమే ఉంటుంది. రసం, సాంబారూ ఉండవే! ఇంతకీ నీ ముఖారవిందం ముడుచుకుపోవడానికి గల కారణం శెలవియ్యి మహారాణీ, చంపక!"

అరవింద : ఆ దారిలోనే ఉన్నాను. అది ఉత్తరం చదువుకుంటోంటే, నేను వెళ్ళి పక్కన నిలబడ్డా. తనకి అయిదు నిముషాల వరకు తెలీలేదు!"

భాస్కర్ : "హ్హా.. హ్హా! కళ్ళు తెరిచే నిద్రపోతుందా? కొందరంతేలే, పుస్తకం ఎదురుగా పెట్టుకుని..."[4]

ఈ విధంగా కథను చమత్కార సంభాషణగా కొనసాగించారు రచయిత్రి.

4. తొలి చూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 15,16

## 5.3.3 కళ్యాణ రాగం కథలో సంభాషణ శైలి :

ఇద్దరు స్నేహితుల మధ్య సంభాషణగా సాగింది కథలో ఈ సన్నివేశం.

రవీంద్ర : నయాగరా ముందు నిలబడినట్టూ... నందనవనంలోకి అడుగుపెట్టినట్టు... మధురమైన అనుభూతి కలిగింది. ఆ అమ్మాయిని చూసిన మొదటి క్షణంలోనే...! మరుక్షణం...

వేణు : నీ మనసు ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళిపోయింది. అంతేగా...! అలా క్షణాల వారీగానే అనుభూతుల్ని వివరించనవసరం లేదు కానీ, మొత్తం మీద విషయం ఏమిటో చెబితే సరిపోతుంది.

రవీంద్ర : ఏదో నా ఆలోచనల్ని అందంగా చెప్పాలని ప్రయత్నిస్తోంటే"... నీకు వినే ఓపిక కూడా లేదా?

వేణు : "అందంగా కాదు... అతిశయోక్తిగా చెబుతున్నావ్! అసలు నయాగరానీ, నందనవనాన్ని నువ్వెపుడు చూశావ్‌రా...? తెలిసిన వాటితో పోలిక చెప్పొచ్చుగా...!"

రవీంద్ర : "అలాగా... ఇందాక భోజనాల దగ్గర అమ్మతో 'గుత్తి వంకాయ కూర అమృతంలా ఉంది అన్నావ్‌గా! మరి అమృతం రుచి నీకెలా తెలుసు...? విన్నదాన్ని బట్టి కూడా కొన్ని విషయాలు తెలిసినట్లే అనిపిస్తాయి! అవునా...?"

వేణు : "నీతో మాటల్లో గెలవలేనులే! కాకపోతే... చూసిన మొదటి క్షణం మూర్ఛబోయాను. మరుక్షణం మురిసిపోయాను... అంటూ క్షణాల లెక్కన వివరణ ఇస్తోంటే... అసలు సంగతి ఎప్పటికి తెలుస్తుందనే తొందరకొద్దీ అన్నాలే... ఇక చెప్పు!"

రవీంద్ర : "వేణూ... నేనెలా ఉంటానో చెప్పరా...!"

వేణు : అదేం ప్రశ్న! నువ్వు అచ్చం నీలాగే ఉంటావ్! సందేహం దేనికో?"

రవీంద్ర : "ఇతరులకి నేనెలా కనిపిస్తానూ అని నా ప్రశ్న!"

వేణు : "మంచియన్నది పెంచువాడు... దేశమును ప్రేమించువాడు... ఆ టైపులో"

రవీంద్ర : "అబ్బా పెళ్ళి చూపుల్లో అమ్మాయిలకీ..."

వేణు : "మారువేషంలో వచ్చిన మన్మధుడు.. కిరీటాన్ని మర్చిపోయిన రాకుమారుడా... అని అనుకునేంత రేంజిలో లేకపోయినా గానీ..."

రవీంద్ర : నేనెలా ఉండనో వర్ణించాల్సిన అవసరం లేదు గానీ, ఎలా ఉంటానో ఒక్క ముక్కలో చెప్పు చాలు.. యావరేజ్... బిలో యావరేజ్... లేక ఎబౌ యావరేజ్...?

వేణు : "ఏవో నేనూ నీలా అందంగా చెప్పాలని ప్రయత్నిస్తోంటే... పూర్తిగా వినకుండానే మధ్యలోనే అడ్డం పడ్డావ్! సరే... ఒక్క ముక్కలో చెప్పాలంటే... ఎబౌ యావరేజ్ కంటే ఇంకా కొంచెం ఎక్కువేలే!"[5]

పై సంభాషణ ఈ విధంగా ఇద్దరి స్నేహితుల మధ్య సరదాగా సాగుతుంది.

## 5.3.4 నేను మంచి దానిని కాదు కథలో సంభాషణ శైలి :

ఈ కథలో భార్యాభర్తల మధ్య సంభాషణను చక్కగా చిత్రించారు రచయిత్రి.

ప్రభావతి : "నేను మంచి దాన్ని కాదని అనుకుంటారు. అంతేగా... ఫర్వాలేదు! మంచిదాన్ననే కిరీటం వల్ల ఒరిగేదేమి ఉండదు!"

రాఘవరావు : "కూ" అంటూ తీయగా కూసే కోయిల... 'కావు.. కావు' అంటూ కోకిలా అరిస్తే కలిగేంత ఆశ్చర్యంతో "మనం చేయాల్సిన పనుల్ని మన స్వభావాన్ని బట్టి చేస్తాం అంతేకానీ ఎవరో కిరీటాలు పెడతారని చేయం. ఎందుకో ఈ మధ్య నువ్వు కొంచెం కొత్తగా మాట్లాడుతున్నావ్!"

ప్రభావతి : నేనూ కొత్త కొత్త సంగతుల్ని తెలుసుకుంటున్నాను మరి! అందరి గురించీ ఆలోచించకుండా ఎవరి సంగతి వాళ్ళు చూసుకునే వాళ్ళే

5. తొలి చూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 22,23

ఈ లోకంలో సుఖపడతారు. అయినా నేనేం విడ్డూరంగా మాట్లాడానని మీరంత ఆశ్చర్యపోతున్నారూ...? మీ తమ్ముడిని ఒక సారి వచ్చి చూసి వెళ్ళమని ఉత్తరం రాయమని చెబితే... 'జబ్బు పడి లేచిన తల్లిని చూడాలని పిల్లలకి ఉండాలి గానీ, బొట్టు పెట్టి రమ్మని పిలవాలా...' అని అన్నా అంతేగా...!"

రాఘవరావు : నేను మాత్రం ఏమన్నానేం...? సరే అంటే సరిపోయే దానికి అంత విసురుగా సమాధానం చెబితే అమ్మ ఏమనుకుంటుందీ అన్నా... అంతే కదా! అమ్మకి అంత గట్టిగా నువ్వు సమాధానం చెప్పటం ఇంతవరకూ ఎప్పుడూ చూళ్ళేదు మరీ!"

ప్రభావతి : ఈ మధ్య నాకూ బావుండటం లేదుగా... మునుపటిలా అందరూ వస్తే చేయలేననిపిస్తోంది. నాకు చేతికి సాయం వచ్చే వాళ్ళెవరున్నారూ...? కమల చదువుకుంటున్న పిల్ల... పని చేతకాదు. అత్తగారు పెద్దావిడ చేయలేరు... చెప్పటమూ భావ్యం కాదు! ఇక మధ్యలో ఉన్నది నేనేగా... చస్తూ అయినా సరే చేసుకుపోవాలి. తప్పదు! మర్యాదల్లో ఎక్కడ ఏమాత్రమన్నా తేడాలొస్తే అంతా వేలెత్తి చూపిది నన్నేగా...! అందుకే రావాలని వున్న వాళ్ళు వస్తారు గానీ ప్రత్యేకంగా పిలవాలా అన్నాను. కోడలు చెడ్డదని అనుకుంటే... అనుకోనివ్వండి![6]

## 5.3.5 పల్లిసిటి కథలో సంభాషణ శైలి :

పెళ్ళి నిశ్చయమైన ఇద్దరు యువతీయువకుల మధ్య జరిగే సరదా సంభాషణ.

శేఖర్ : "ఏమిటీ, నేను వస్తున్నట్లు ముందే తెలిసిందా, పిలవకుండానే తలుపులు తీశావే?"

కవిత : "ఆ అడుగుల సడి నాకెరుకే, ఆ అడుగుల వడి నాకొరకే"

శేఖర్ : "అబ్బ! అదరగొట్టేశావ్‌లే!" నీకో శుభవార్త చెప్పాలని వచ్చాను. చెబితే ఏమిస్తావో చెప్పు ముందు"

6. తొలి చూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 75,76

కవిత : "నీది కానిదేముంది నాలో.... నిజానికి నే వున్నది నీలో..."

శేఖర్ : "భలే తప్పించుకున్నావ్‌గానీ, ఏమిటివ్వాళ చాలా హుషారుగా వున్నట్లున్నావ్! అవునూ... నిన్నటితో నీ ఎగ్జామ్స్ పూర్తయ్యాయి, ఈ వేళ నీ బర్తడే! ఫ్రెండ్స్‌తో ఏ మార్నింగ్‌షోకో చెక్కేసి వుంటావనుకున్నానే, ఇంట్లోనే వున్నావు, ఏం చేస్తున్నావ్!"

కవిత : నీ రూపమే భావనం... నీ కోసమే జీవనం.

శేఖర్ : ఏమైంది నీ కివ్వాళ! మాటలు మానేసి పాటలు పట్టుకున్నావ్! పైత్యంగాని చేసిందా?

కవిత : "ఏమిటీ... నీకు పైత్యంలా అనిపిస్తోందా? కృష్ణశాస్త్రిలాంటి మహాకవుల కవితలకి గుండె గుభాళించి పోవాలి గానీ!"

శేఖర్ : "ఏం గుభాళింపో... నీకేమైనా అయిందేమోనని గుండెల్లో గుబులు మాత్రం మొదలైంది!" నిట్టూరుస్తూ భయాన్ని అభినయిస్తూ అన్నాడు.

కవిత : "చాల్లే!" ఇంతకీ శుభవార్త అన్నావు, చెప్పనేలేదు...?

శేఖర్ : "మనం సినిమాని ధైర్యం చేసి స్వంతంగా రిలీజ్ చేసినందుకు బాగానే నడుస్తుంది. అదీ శుభవార్త! అన్నీ సెంటర్స్‌కీ తిరిగొచ్చాగా మామయ్య క్లబ్బు దగ్గర కనిపిస్తే చెప్పి యిటు వచ్చాను."

కవిత : "ఓస్ ఇంతేనా! శుభవార్త అంటూ ఊరిస్తే, ఇంకేదో అనుకున్నా, ఇది నాన్నకీ, నీకూ శుభవార్త కావచ్చేమో కానీ నాకు మాత్రం మామూలు వార్తే."

శేఖర్ : శుభవార్త అంటే ఏమనుకున్నావేమిటి? పెళ్ళికి ముహూర్తాలు పెట్టారన్న సంగతేమోనని ఎదురు చూశావా?

కవిత : "ఏం కాదులే?"

ఈ విధంగా శేఖర్, కవితల మధ్య చమత్కారంగా ఈ సంభాషణ సాగింది.

## 5.3.6 అమ్మా మన్నించవూ కథలో సంభాషణ శైలి :

ఈ కథలో ఆఖరి సన్నివేశంలో తల్లికొడుకుల మధ్య జరిగిన సంభాషణ పాఠకునికి ఆలోచింపచేసేలా చిత్రాంచారు. తల్లి చేతికి ఉన్న బంగారు గాజులు ఏమయ్యాయని అనుమానంతో ప్రశ్నించిన కొడుక్కి సమాధానంగా

అన్నపూర్ణమ్మ: "చెల్లెలికి ఇచ్చానని ఎవరు అన్నార్రా?"

కేశవరావు : "ఏం చేశావు మరి?"

అన్నపూర్ణమ్మ: "ఏం చేశానా...! మా వల్ల కాదని మీరంటే నరసమ్మకి వడ్డీతో ఇవ్వటానికి అమ్మాను"

కేశవరావు : ఆ సంగతి చెప్పొచ్చుగా

అన్నపూర్ణమ్మ: ఎందుకు చెప్పలేదా? అబద్దమాడరాదు అంటూ నీకు నీతులు నేర్పించిన నేను నీకు అబద్ధం చెప్పలేదని సంజాయిషీ ఇచ్చుకోవటం అవమానం కాదూ? అయినవాళ్ళతో వాదనెందుకని నాకు రావాల్సిన ఆస్తిని తేలిగ్గా వదులుకోగలిగిన నేను ఈ కొంచెం డబ్బు కోసం అబద్ధం చెప్పగలనని ఎలా అనుకున్నావు? చిన్నప్పటి నుండీ ఈ ఇంట్లో నీకు తెలియకుండా, చెప్పకుండా ఏది చెయ్యనని నీకు తెలిసినా, ఎక్కడో పుట్టి పెరిగిన కోడలు ఏదో అంటే నువ్వెలా నమ్మావు? సాక్ష్యం చూపించి నిజం నిరూపించుకోవడం నాకు అవమానం కాదూ...?

తల్లి తీక్షణమైన చూపులోని ఆ ప్రశ్నలు వాడిబాణాలై గుండెకు గుచ్చుకోగా కేశవరావు తప్పు తెలుసుకుని విలవిలలాడి పోయాడు.

కేశవరావు : "ఇంట్లో డబ్బు ఉంది. ఇప్పుడే నీకు ఇస్తాను. రేపే నేను నీ చేతులకు గాజులు చేయిస్తాను. పొరపాటు జరిగిందమ్మా అని తల్లితో అంటూ భార్య సరితతో "ఈ ఇల్లు ఒక్కటిగానే ఉండాలి. అడ్డంగా ఉన్న చెక్క బీరువాని ఇక్కడ నుండి తీసిపడెయ్యి"[7] అని అంటాడు.

---

7. తొలిచూపు కథా సంపుటి – గోగినేని మణి – పుట 124

అమ్మా మన్నించవూ కథలో చివరి సన్నివేశంలోని ఈ సంభాషణ కన్నీళ్ళు తెప్పించక మానవు. భార్య మాటలు నమ్మి కన్న తల్లులను అవమానించే కొడుకులలో మార్పును తెచ్చే ప్రయత్నంలో రచయిత్రి ఈ సన్నివేశంను కల్పించారు.

## 5.3.7 ఎన్నిక కథలో సంభాషణ శైలి :

బావామరదళ్ళ మధ్య జరిగే సరదా సంభాషణ ఇలా సాగింది.

రాంబాబు : "తులసీ నేనిక్కడకు వచ్చింది ఎందుకో తెలుసా?"

తులసి : తెలుసు

రాంబాబు : తెలుసు? అయితే నా మనసులోని రహస్యం కనిపెట్టేశావన్న మాట!

తులసి : అదేమిటి? రహస్యమేముందిందులో. ఎన్నికల ప్రచారానికి సాయంగా వచ్చావంతేగా!

రాంబాబు : నేను వచ్చిన అసలు కారణాన్ని కనిపెట్టేశావు కాబోలు అనుకున్నాను. ఇంతకీ అసలు కారణం చెప్పమంటావా?

తులసి : చెప్పూ?..

రాంబాబు : ఈ మరదలు మాణిక్యాన్ని ప్రతీ రోజు చూసే భాగ్యం ఈ కొద్దీ రోజులయినీ దక్కుతుందని

తులసి : బావుంది, నన్ను చూడటం ఓభాగ్యము? నేనేమైనా సినిమా తారనా?

రాంబాబు : "సినిమాల్లో తప్ప సినిమా తారల్ని నాలాంటి వాడెవ్వడూ చూడాలనుకోడు. మేకప్ మెరుగులు తీసేసే వాళ్ళెందుకు పనికి వస్తారు నీముందు?"

తులసి : ఉండు ఓ పువ్వు తీసి చెవిలో పెట్టుకుంటా ఇక చెప్పు నీ కబుర్లు వింటా లేకపోతే ఏమిటి బావా, నీ పొగడ్తలు!

రాంబాబు : "సరే సరే అందాన్ని అందమంటే పొగడ్త అవుతుందా? మల్లెపూవుని మల్లెపూవని అనక బీరపువ్వు అనగలమా?"[8]

---

8. తొలిచూపు కథా సంపుటి - గోగినేని మణి - పుట 128

## 5.3.8 నైన్... ఒన్... ఒన్... కథలో సంభాషణ శైలి :

ఒక అల్లారి పిల్లాడు, తన తల్లితో చేసిన సరదా సంభాషణ ఇది.

చింటూ : మమ్మీ.... అసూయ ఆంటీ నీకు ఫోను చేసింది.

వసుధ : "ఏమిట్రా ఆ వెధవ మాటలు? అసూయ ఆంటీ ఏమిటీ?"

చింటూ : ఆ ఆంటీ పేరులోని 'న' మైనస్ చేస్తేనే ఆ ఆంటీకి సరిగ్గా సరిపోతుందని డాడితో నువ్వు మొన్న చెప్పావ్‌గా! అందుకే అలా అన్నా. సోది ఆంటీ వాళ్ళందరితో కలిసి పదినిమిషాల్లో ఇక్కడకు వస్తున్నామని నీకు చెప్పమన్నారు.

వసుధ : 'సోది ఆంటీయా?"

చింటూ : సోది ఆంటీకి ఆ పేరు నేనే పెట్టాలే! ఎప్పుడూ ఏదో మాట్లాడుతూనే ఉంటారుగా! అందుకని!

వసుధ : పెద్దా చిన్నా లేకుండా ఏమిటా మాటలు? వెధవ్వేషాలేయకు; వాళ్ళ ముందు కూడా ఇలా నోరు జారి ఎప్పుడో నా పరువు తీసేట్లున్నావ్!

చింటూ : ఇప్పటికి రెండు సార్లు వెధవ అన్నావ! ఇక అన్నావంటే ఊరుకోను!

వసుధ : ఏం చేస్తావురా వూరుకోక?

చింటూ : ఏం చేస్తానా! నైన్... ఒన్... ఒన్...[9]

అమెరికాలో పిల్లలను దండించే తల్లిదండ్రులకు కఠిన శిక్ష అమలు చేస్తారు. పిల్లలను క్రూరమైన తల్లిదండ్రుల నుండి కాపాడాలనే ఉద్దేశంతో 911 హెల్ప్‌లైన్‌ను అందుబాటులో ఉంచుతారు. అది తెలిసిన ఆకతాయి పిల్లాడు. తమ తల్లిని ఈ సన్నివేశంలో బెదిరిస్తాడు.

## 5.3.9 అమ్మకోరిక కథలో సంభాషణ శైలి :

ఈ కథలోని ప్రారంభ సన్నివేశంలో అన్నాచెల్లెళ్ళ మధ్య జరిగిన సంభాషణ వారిద్దరి మధ్య ఉండే ఆప్యాయతానురాగాలను తెలియజేస్తుంది.

9. మనసున మల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 9